అంతర పంట..

నిత్యం ఆదాయమంట!



కోమరేపల్లిలో వక్క తోటలో అంతర పంటగా సాగు చేసిన పూల తోట



గ్యారగొండనపల్లిలో వక్క తోటలో అంతర పంటగా వేరుశనగ, పుచ్చకాయ సాగు చేసిన దృశ్యం

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- స్వల్ప కాలంలోనే పంట చేతికి
- అన్నదాతలకు ఆర్థిక భరోసా

అగళి: వాణిజ్య పంటల్లో అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, పూల సాగు చేపట్టి అగళి మండల రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటలకు దీర్ఘకాలంగా పెట్టుబడులు పెట్టాల్సి ఉండటంతో రైతులు అదనపు ఆదాయ వనరుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలను కోల్పోవటం, లేకపోతే గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఈ అంతర పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. ఈ పంటల సాగుతో ప్రధాన పంటకు పెట్టుబడి కోసం వెళ్లాల్సిన పని లేకుండా అంతర పంటలు ఆదాయాన్నిస్తున్నాయి. మడకశిర నియోజకవర్గంలో సుమారు 375 ఎకరాల్లో అంతర పంటలు సాగవుతున్నాయి. వీటిలో అధికంగా అగళి, అమరాపురం, రొళ్ల మండలంలో సుమారు 250 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఎన్నో లాభాలు..

వాణిజ్య పంటలకు ఏడాది పొడవునా పెట్టుబడి పెట్టాల్సి ఉండగా అంతర పంటల ద్వారా లభించే ఆదాయాన్ని వినియోగించడంతో ఆర్థిక భారం తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. పొలాల్లో కలుపు అంతంత మాత్రంగానే రావడం, ఈ అంతర పంటలు పెట్టుబడి తక్కువ అవడం, ఎక్కువ లాభాలు రావడంతో వీటిని సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఎరువు, పురుగు మందుల ధరలు చుక్కలనంటడంతో ఒక పంటనే సాగు చేసి లాభాలు ఆర్జించే రోజులు పోయాయని చెబుతున్నారు. వేసిన పంట బాగా ఉన్నా అధిక దిగుబడులు వచ్చినా ఆ సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోతే నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. అంతర పంటలతో కేవలం 60 రోజుల్లో ఫలసాయం పొంది లాభాలు ఆర్జించవచ్చంటున్నారు. వాణిజ్య పంటల పెట్టుబడి పెరగడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ పంటలు ఆదుకుంటున్నాయని చెబుతున్నారు. అంతర పంటలుగా మిరప, కర్బూజ, పుచ్చకాయ, ఆకుకూరలు, వేరుశనగ, పూలు తదితర పంటలు సాగు చేస్తున్నారు. వీటితో నిత్యం ఆదాయం రావడంతో పాటు తెగుళ్లతోపాటు కలుపు బెడద తగ్గి పెట్టుబడి ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఆదాయం వస్తోంది



వక్క తోటల్లో పూల తోట వేశాను.కొంత భాగంలో అంతర పంటగా కూరగాయలు నాటాను. అంతర పంటల సాగుకు పెట్టుబడి తక్కువ అవ్వడంతో పాటు అదనపు ఆదాయం వచ్చి ఆదుకుంటున్నాయి.

– రైతు హనుమంతరాయప్ప, కొమరేపల్లి, అగళి మండలం

అంతర పంటతో లాభాలు



వక్క తోటలో పుచ్చకాయ సాగు చేసి లాభాలు పొందుతున్నాను. పొలంలో ఖాళీప్రదేశాల్లో కూరగాయలు, దోసకాయ ఇలా ఏదో పంటను అంతర పంటగా వేయడం మొదలు పెట్టాను. అంతర పంటల ఉత్పత్తులతో ఆదాయం నిరంతరం వస్తోంది. దీంతో పెట్టుబడికి ఇబ్బంది ఉండటం లేదు.

–నాసిర్, అగళి

తెగుళ్ల వ్యాప్తి తక్కువ

అంతర పంటలతో తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. పూల సాగుతో అక్కడకు వచ్చే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. దీనివల్ల తెగుళ్లు ఆశించవు. చేలల్లో కలుపు నివారణ కూడా అవుతుంది. పెట్టుబడి తక్కువగా ఉంటుంది. పంట మార్పిడితోపాటు అంతర పంటల నుంచి వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది.

–శేఖర్‌నాయక్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

కెంచమాంబ ఉత్సవాలు



పత్యేక అలంకరణలో కెంచమాంబదేవి

అమరాపురం: గొడనకుంట గ్రామంలో కెంచ మాంబదేవి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మద్దనకుంట, అమరాపురం, గొడనకుంట, తమ్మడేపల్లి, నగోనపల్లి, దేవగానపల్లి, కర్ణాటకలోని మద్దిహళ్లి, అల్లద్ది, మరిదాసనహళ్లి, శైలాపుర, కెంచమ్మనహళ్లి, క్యాతకనహళ్లి, ఓబళాపురం తదితర గ్రామాల నుంచి వక్కలిగ కులానికి చెందిన సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన 800 కుటుంబాల వారు అమ్మవారికి కానుకలు(బియ్యం, బేడలు, బెల్లం, కొబ్బరి) అందజేశారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

కర్ణాటక మంత్రి ప్రత్యేక పూజలు: కర్ణాటక మంత్రి, హిరియూరు శాసనసభ్యులు సుధాకర్ గొడనకుంట గ్రామానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

నేత్రదానం



నేత్రాలను తరలిస్తున్న వైద్య బృందం, దాత కుటుంబసభ్యులు

హిందూపురం: పట్టణంలోని వాసవీ ధర్మశాల రోడ్డులోని అశ్వత్ నారాయణ భార్య సుకన్యమ్మ(78) ఆదివారం మృతి చెందారు. సుకన్యమ్మ నేత్రాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. శ్రీనివాస మూర్తి ఫౌండేషన్ సభ్యులు మాధవి, రవి, డాక్టర్ సంధ్య, లక్ష్మి, సులేఖలు దాత నేత్రాలను సేకరించి బెంగళూరులోని డాక్టర్ రాజ్ కుమార్ నేత్రదాన కేంద్రానికి పంపించారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దాం



సమావేశానికి హాజరైన అధికారులు, గ్రామపెద్దలు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ చైర్మన్ కరణం రమానందన్ కోరారు. ఆదివారం ఉదయం స్థానిక లేపాక్షి ఆలయ ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై గ్రామపెద్దలు, అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. శివరాత్రి రోజును పలు సాంస్కృతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపా న్నారు. 27న బ్రహ్మరథోత్సవం రోజున రథోత్సవం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 28 రాత్రి జరిగే పూలపల్లకీ సందర్భంగా కీలు గుర్రాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోండి

గుడిబండ: సొంత భూములు కల్గిన రైతులు రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏఓ వీరనరేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పెట్టుబడి సాయంతో పాటు సబ్సిడీ ఎరువులు, పంట బీమా, పంటలకు కనీస మద్దతు ధర, పంటరుణాలు వర్తిస్తాయని తెలిపారు. పట్టదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌తో పాటు ఆధార్ నంబర్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకువచ్చి వీఏఏ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



షిర్డీసాయికి జ్యోతులు మోస్తున్న భక్తులు

రొద్దం: ఆర్ మరువపల్లి పాత చెక్ పోస్ట్ వద్ద వెలసిన సద్గురు షిర్డీసాయి ఆలయ 19వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. షిర్డీసాయి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు నిర్వహించారు. రొద్దం పెద్దాంజనేయస్వామి ఆలయం నుంచి మహిళలు జ్యోతులు ఎత్తుకుని షిర్డీసాయి ఆలయం వరకూ ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం నవగ్రహ శాంతి యజ్ఞం, సద్గురు ప్రవచనాలు, పాదపూజ, మధ్యాహ్నం పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కోఆప్షన్ సభ్యుడికి పరామర్శ



ఫక్రుద్దీన్‌ను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

మడకశిర: మడకశిర మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆదివారం కోఆప్షన్ సభ్యుడి ఇంటి కెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు బాషా, ఫయాజ్, అంజలి, శేషాద్రి, జబీ, రంగనాథ్, నరసింహ, శివరాజు, యంజారప్ప తదితరులు ఉన్నారు.

వైభవంగా మహర్షి వాల్మీకి రథోత్సవం



జనం మధ్య సాగుతున్న రథోత్సవం

పావగడ: దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి మహర్షి వాల్మీకి గురు పీఠంలో ఆదివారం మహర్షి వాల్మీకి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రథోత్సవాన్ని గురు పీఠం మహాస్వామి ప్రసన్నానంద స్వామిజీ ప్రారంభించారు. వేలాది మంది వాల్మీకి జనం మధ్య రథం ముందుకు సాగింది. భక్త జనం జేజేల నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. సాయంత్రం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, జారకిహొళితోపాటు వాల్మీకి సంఘం ప్రముఖులు హాజరయ్యారు.

రైతు సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం



మాట్లాడుతున్న టీఎస్.దీపిక

హిందూపురం: రైతు సమస్యలపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్ సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జగనన్న తన పాలనలో వ్యవసాయానికి ఎన్నో పథకాలు, రాయితీలు అందించి రైతును రాజుగా నిలిపారన్నారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇలా అన్నింటినీ తొలగిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. జగనన్న ప్రభుత్వంలో వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందేదని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. రాత్రి వేళల్లో కరెంటు ఇవ్వడం ద్వారా పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఎంతో మంది రైతులు పాముకాటుకు ప్రాణాలు కోల్పోయారన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కింద ఏటా రూ.13,500 క్రమం తప్పకుండా రైతుల ఖాతాలకు డబ్బు జమయ్యేదని, కూటమి ప్రభుత్వం పైసా సాయం అందించడం లేదని మండిపడ్డారు. జగనన్న ఆర్బీకేల ద్వారా పంట ఉత్పత్తులు మద్దతుతో ధరతో కొనుగోలు చేసి రైతులకు దళారుల బెడద లేకుండా చేశారన్నారు. జగనన్న ఉచితంగా పంటల బీమా అందిస్తే చంద్రబాబు బీమా ప్రీమియం భారాన్ని రైతులపై వేశారన్నారు. సీఎం చంద్రబాబు రైతులను అన్నివిధాలా ఆదుకోవడంతోపాటు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటాం





ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, మసీదు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఈరలక్కప్ప, నాయకులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: నియోజకవర్గంలోని ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.పట్టణంలో ఆదివారం జరిగిన జామియా మసీదు ప్రారంభోత్సవానికి వారు హాజరై మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని తెలిపారు. తండ్రి బాటలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని గుర్తు చేశారు. ముస్లింలకు ప్రత్యేకంగా పథకాలు అమలు చేసి ఆర్థికాభివృద్ధికి బాట వేశారని తెలిపారు. ముస్లింలు మడకశిరలో నూతనంగా జామియా మసీదును నిర్మించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈసందర్భంగా ముస్లింలకు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా మసీదు ప్రారంభోత్సవానికి నియోజకవరగ వ్యాప్తంగా వేలాది మంది ముస్లింలు తరలి వచ్చారు. ముస్లింలందరూ ఈసందర్భంగా మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిపారు. వివిధ రాజకీయపార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, స్థానిక నాయకులు అక్రమ్, శేషాద్రి, అంజలి, ఫయాజ్, రంగనాథ్, నరసింహ, జబీ, యంజారప్ప, శివరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం హరిప్రసాద్‌కు సన్మానం

రొళ్ల: రత్నగిరి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న కే.హరిప్రసాద్‌ను కడపలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి రచయితల మహాకవి సమ్మేళనంలో ఘనంగా సన్మానించారు. హరిప్రసాద్ తాను స్వీయ రచన చేసిన లేపాక్షి వైభవం పాట గానం చేశారు. దీంతో కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జింక సుబ్రహ్మణ్యం తనను శాలువా, జ్ఞాపికతో సత్కరించినట్లు హరిప్రసాద్ తెలిపారు.

50 ఏళ్ల తర్వాత ఒకేచోటకు..



సమావేశమైన పూర్వ విద్యార్థులు

గోరంట్ల: స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(పూర్వపు కో ఎడ్యుకేషన్) 1974–75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమేళనంనిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత అందరూ ఒకచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు రఘురామిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరమణను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం మాధవీలత, పూర్వ విద్యార్థులు రిటైర్డు ఆర్‌డీఓ విశ్వనాథ్, విశ్రాంత టీచర్ కృష్ణారెడ్డి, కొండాపురం సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో బాబు సర్కార్ విఫలం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్





స్థానికులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్ , పార్టీ శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న దృశ్యం

సోమందేపల్లి: రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని, ఎన్నికల హామీలు అమల్లో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ విమర్శించారు. ఆదివారం మేకలపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు తప్పుడు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమం, అభివృద్ధి గాలికి వదిలేసింది అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సవిత ఎన్నికల ముందు ఊరూరా సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఉదరగొట్టి ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు చెప్పిన సమయానికి ఇచ్చారని, అందులో ఏ ఒక్క పథకమైనా కూటమి ప్రభుత్వం ఇస్తుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయించి ఇస్తున్నారని జగనన్న చెప్పినట్లు గా 2.0 వర్షన్ ఏమిటో తాను కూడా చూపిస్తానని కూటమి నాయకులకు హెచ్చరించారు. ఎనిమిది నెలల్లోనే ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో వ్యతిరేకత మొదలైందని, రానున్న ఎన్నికల్లో ఓటు రూపంలో ప్రజలు జవాబు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాలకు చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని మళ్లీ సంక్షేమ పాలన తీసుకొద్దామని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యనాయకులు చరణ్ రెడ్డి, జయరెడ్డి, శ్రీనివాసులు, వైస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కంబాలప్ప, సర్పంచ్‌లు పరంధామ, జీలాన్ ఖాన్, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కేడర్..

మేకలపల్లి గ్రామంలో ఆదివారం కాఫీ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి మాజీ మంత్రి, సమన్వయ కర్త ఉషశ్రీ చరణ్ హాజరయ్యారు. గ్రామంలో ఆమె కలియదిరిగి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా టీడీపీకి చెందిన యువ నాయకుడు నరసింహమూర్తి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆదెప్ప, కంబాలప్ప, ముత్యాలు, గంగాధర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటన

పరిగి: మండలంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు ఆపార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు శాసనకోటలోని శివాలయంలో స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. శ్రీరంగరాజుపల్లిలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శించనున్నారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా తిరువీధి ఉత్సవం

అమరాపురం: స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరు వీధి ఉత్సవాన్ని ఘనంగా తినిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని పల్లకీలో ఉంచి తిరువీధి ఉత్సవాన్ని చేపట్టారు.

బాలుడి అప్పగింత

సోమందేపల్లి: ఇంటి నుంచి పారిపోయిన వచ్చిన బాలుడిని గుర్తించిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. హిందూపురం మండలం ముద్దిరెడ్డిపల్లికి చెందిన దినేష్ కుమార్ ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. ఈక్రమంలో బాలుడు చాలకూరు గ్రామ సమీపంలో ఒంటరిగా ఉన్నట్లు సమాచారం రావడంతో కానిస్టేబుల్ రామకృష్ణ అతడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం తల్లి దండ్రులకు సమాచారం అందించి బాలుడిని వారికి అప్పగించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

జాతీయ పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం టౌన్: అబాకస్ జాతీయ స్థాయి పోటీల్లో పట్టణంలోని డీబీ కాలనీలో గల అబాకస్ కిడ్స్ కాన్సెప్ట్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం బెంగళూరులో జరిగిన అబాకస్ జాతీయ స్థాయి పోటీల్లో 31 మంది విద్యార్థులు పాల్గొనగా 25 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు పొందారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులు సెంటర్ నిర్వాహకురాలు శృతి రేచల్‌కు బెస్ట్ ఫ్రాంచైజీ అవార్డు, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా నరసింహ

పావగడ: విద్యాశాఖ ఉద్యోగుల సంఘం పావగడ అధ్యక్షుడిగా రాజవంతి ప్రభుత్వ పాఠశాల ఆంగ్లోపాధ్యాయుడు ఆర్ ఎం నరసింహ నియమితులయ్యారు. కార్యదర్శిగా అర్చన, గౌరవాధ్యక్షుడిగా అధ్యాపకుడు దొడ్డయ్య, ట్రెజరర్‌గా సాదిక్ ఉల్లా షరీఫ్, జిల్లా పరిషత్ సభ్యుడిగా ఈసీఓ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షుడిగా పి బంగారు లింగం, ఉపాధ్యక్షురాలు గా శాంతకుమారి, వెంకటలక్ష్మి నియమితులయ్యారు. వారి నియామకాలు విద్యాశాఖ ఉద్యోగుల సంఘం రాజ్యాధ్యక్షుడు చౌడప్ప, జిల్లా అధ్యక్షుడు సిద్దేశ్ నేతృత్వంలో నిర్వహించారు.

భూములను క్రమబద్ధీకరించుకోండి

రొళ్ల: గ్రామాల్లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, భూముల క్రమబద్ధీకరణకు ప్రజల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ కింద 2019కి ముందు ఆర్‌సీసీ లేదా ఇతరత్రా పైకప్పులతో ఇటుక గోడల నిర్మాణాలను ద్వారా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, స్థలాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

జూదాలు అరికట్టడంలో పోలీసుల వైఫల్యం

పావగడ: తాలూకా వ్యాప్తంగా 4 పోలీస్ స్టేషన్ల పరిధి లో విశృంఖలంగా సాగుతున్న మట్కా, పేకాట, ఎద్దాట జూదాలు అరికట్టడంలో పోలీసులు పూర్తిగా వైఫల్యం చెందారని స్థానిక దళిత నాయకుడు డీజేఎస్ నారాయణప్ప ఆరోపించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ ఎస్టీ సమస్యల వినతి సభలో ఆయన మాట్లాడారు. అరసికెరె పోలీస్ స్టేషన్ ఎస్సై పీసీ షౌకత్ అలి మట్కా, పేకాట జూదాల నిర్వహకులతో నేరుగా సంబంధాలు పెట్టుకున్నారని ఈ నేపథ్యం లో జూదాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆరోపించారు. మరో దళిత నాయకుడు బంగారప్ప మాట్లాడుతూ పట్టణంలో గంజాయి విక్రయాలు ఊపందుకుంటున్నాయని యువత పెడ దారిన పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీ మంజునాథ్ మాట్లాడుతూ జూదాల నిర్వాహకులతో సంబధాలు పెట్టుకున్న పోలీసులను ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

మడకశిర: నియోజకవర్గంలో మొదటి విడత ఇంటర్ ప్రాక్టికల్స్ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి విడత ఈనెల 14 వరకు, రెండో విడత ఈనెల 15 నుంచి 20 వరకు జరుగుతాయి. రోజూ ఉదయం 9 నుంచి12 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 637 మంది విద్యార్థులు ఇందులో పాల్గొననున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మడకశిర జూనియర్ కళాశాలలో 176 మంది, వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 268 మంది, అమరాపురంలో 112 మంది, అగళిలో 55 మంది, గుడిబండలో 26 మంది చొప్పున విద్యార్థులు ప్రాక్టికల్స్‌ను హాజరుకానున్నట్లు వివరించారు.

సబ్సిడీ రుణాలకు 12లోపు దరఖాస్తు చేసుకోవాలి

మడకశిర: రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు ఈనెల 12లోపు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపీడీఓ సోనిబాయి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, కాపు(బలిజ) వర్గాల వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.